క్లుప్తంగా

నేడు అందుబాటులో జెడ్పీ చైర్మన్

వి.కోట: నేడు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అందుబాటులో ఉంటున్నట్లు ఆయన బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10-30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా తమ సమస్యలను చెప్పాల్సి ఉంటే ఉదయం ప్రజా పరిషత్ కార్యాలయం వద్దకు రావాలని ఆయన సూచించారు.

రాయల పాలన అజరామరం


సదుం: పాలాభిషేకం చేస్తున్న నేతలు

సదుం: శ్రీకృష్ణదేవరాయల పాలన అజరామరమని బలిజ సంఘం నాయకులు తెలిపారు. స్థానిక బస్టాండ్‌లో ఆయన పట్టాభిషేక మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. రాయల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి పాలాభిషేకం చేశారు. స్వీట్లు పంచి, గ్రామంలో ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో ఆకుల శ్రీనివాసులు, రామయ్య, వీఆర్వో పురుషోత్తం, రమేష్, దాము, గణేష్, వెంకటరత్నం, కుమార్, జగదీష్, సుబ్రహ్మణ్యం, రాము పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

రొంపిచెర్ల: ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే శిక్షణ తరగతులను సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు విజయవంతం చేయాలని ఎంపీడీఓ రెడ్డెప్పచ్చారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీలలో పరిసరాల పరిశుభ్రత, వీధి దీపాల ఏర్పాటు, వివిధ కార్యక్రమాలపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు మూడు రోజులు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఎంపీడీఓ ప్రకటనలో కోరారు.

పెన్షనర్ల సంఘం అధ్యక్షుడిగా రత్నారెడ్డి


మాట్లాడుతున్న రత్నారెడ్డి

పలమనేరు: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం పలమనేరు శాఖ అధ్యక్షుడిగా రత్నారెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆ మేరకు స్థానిక సంఘ కార్యాలయంలో గౌరవాధ్యక్షుడు నల్లారెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఇందుకు సంఘ జిల్లా అధ్యక్షుడు నాగరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పెన్షనర్ల సమస్యల సాధన కోసం కృషిచేస్తానని రత్నారెడ్డి తెలిపారు. ఆపై సంఘ సభ్యుల సమస్యలను ప్రస్తావించి వాటి పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని విన్నవించారు. సంఘ సహాధ్యక్షుడు గురుమూర్తి పాల్గొన్నారు.

చదువుకు వయస్సుతో పని లేదు


మాట్లాడుతున్న విద్యాశాఖాధికారి

వి.కోట: చదువుకోవాలనే సంకల్పం ఉంటే చదువుకోవడానికి వయస్సుతో పనిలేదని ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్రనాథ్ అన్నారు. బుధవారం మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో మండల ఉపాధ్యాయులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది, ఇంటర్మీడియట్‌లో ఎవరైనా వయస్సుతో నిమిత్తం లేకుండా ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా చేరొచ్చని పేర్కొన్నారు. ఎంఈఓ-2 మురుగేష్, సీఆర్‌పీలు, ఎస్ఎస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


రాము

పుంగనూరు: పుంగనూరు మండల నూతన తహసీల్దార్‌గా రాము బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ శివయ్యను బదిలీ చేసి ఆయన స్థానంలో అన్నమయ్య జిల్లాలో పనిచేస్తున్న రామును నియమించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు భూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ

కుప్పం: పరమసముద్రం గ్రామం వద్ద క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు ఆడడం వల్ల మానసికంగా ఆరోగ్యం ఉంటారని ఆయన అన్నారు. మున్సిపాలిటీ టీడీపీ అధ్యక్షుడు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

చెదురుతున్న సొంతింటి కల

- కూటమి ప్రభుత్వం తీరుపై ఆందోళన చెందుతున్న లబ్ధిదారులు


బైరెడ్డిపల్లె సమీపంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీ

బైరెడ్డిపల్లె: సాధారణంగా సొంతింటి కోసం ప్రతిఒక్కరూ కలలుకంటుంటారు. ఆర్థిక స్తోమత ఉన్నవారు తమ హోదాకు తగ్గట్టుగా ఇంటిని సమకూర్చుకుంటారు. మధ్య తరగతి వారు అప్పో సప్పో చేసి తాహతుకు తగ్గ ఇంటితో సంతృప్తి పడతారు. పేదవారికి మాత్రం సొంతిల్లు కలే. వారి స్వప్నాన్ని నిజం చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శాయశక్తిలా కృషిచేసింది. పేదలకు సొంత స్థలాన్ని కేటాయించి ఇంటి నిర్మాణానికి అన్ని విధాలా సహకరించింది. తమ స్వప్నం సాకారమవుతుందని అనుకుంటున్న తరుణంలో ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ పేదల కలను కల్లలుగా చేసేందుకు అడుగడుగునా అవరోధాలు కల్పిస్తోంది. ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలంతో పాటు ఇంటిని నిర్మించుకోవడానికి అప్పటి జగనన్న ప్రభుత్వం లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేసింది. మండల పరిధిలో కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ భూములు గుర్తించి పట్టాలు మంజూరు చేశారు. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ భూములు లేకపోవడంతో గ్రామ సమీపంలోని భూములు కొనుగోలు చేసి పట్టాలు మంజూరు చేశారు. దీంతో మూడేళ్ల నుంచి ఇంటి నిర్మాణాలు చేశారు. బైరెడ్డిపల్లె మండల పరిధిలో 1,977 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు ఇచ్చి రూ.1.80 లక్షల సొమ్ము మంజూరుకు ఎంపిక చేసింది. ఇప్పటివరకు 1,305 మంది లబ్ధిదారులకు పూర్తి బిల్లులు మంజూరు చేయడంతో ఇంటి నిర్మాణాలు పూర్తి కావచ్చాయి. మిగిలిన 672 గృహాలు వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్నాయి. వీటిలో అధిక శాతం పునాది దశలోనే ఉన్నాయి. నిరుపేదలు పునాదులతోనే ఇళ్ల నిర్మాణాన్ని నిలుపుదల చేశారు. ఇల్లు నిర్మించుకునేందుకు తగిన స్తోమత లేకపోవడంతో పునాదులు వేసి నిర్మాణాలను నిలుపుదల చేశారు. అప్పు పుట్టక, ఆర్థిక స్తోమత లేక నిరుపేదలకు సొంతింటికల కలగానే మిగిలింది. జగనన్న కాలనీలో గత ప్రభుత్వం మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం రావడంతో లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది. ఇంటి నిర్మాణాలు చేసుకుంటే బిల్లులు వస్తాయా రావా అన్న ఆలోచనలో లబ్ధిదారులు పడ్డారు. దీంతో లబ్ధిదారులు పనులను పూర్తి స్థాయిలో నిలిపివేశారు.

అసంపూర్తి ఇళ్లకు సాయంచేయాలి..



ఇళ్ల స్థలాల కోసం ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్నాం. జగనన్న ప్రభుత్వంలో ఇళ్ల స్థలం ఇచ్చారు. రూ.1.80 లక్షలు సాయం చేశారు. అయితే ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదు. కొత్త ప్రభుత్వం మమ్మల్ని ఆదుకొని ఇళ్ల నిర్మాణానికి పూర్తిగా సహకరించాలి. లేకుంటే అసంపూర్తి నిర్మాణాలతోనే ఉండిపోతాయి.

ముబీనా, బైరెడ్డిపల్లె

కొత్త రుణాలు ఇవ్వాలి



తమకు సెంటున్నర భూమి ఇచ్చారు. ఇంటి నిర్మాణం కోసం హౌసింగ్ ద్వారా రుణాన్ని మంజూరు చేశారు. పునాదులు వేసి, అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు రూ.4 లక్షలు రుణాలు అందజేయాలి. ప్రభుత్వం ఆదుకోకపోతే పునాదులతోనే మా ఆశలు నిలిచిపోతాయి. కొత్త ప్రభుత్వం, కొత్త నిబంధనలతో తమ సొంతింటి కల కలగానే మిగల్చకుండా చూడాలి.

– ముబీనా మస్తాన్, బైరెడ్డిపల్లె

డిసెంబర్ వరకు బిల్లులు చెల్లిస్తాం



మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి 1,977 ఇంటి పట్టాలు మంజూరు చేశారు. ఇందులో 1,305కు పైగా నిర్మాణాలు పూర్తిచేశారు. చాలా మంది నిర్మాణాలను ఆపేశారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేసుకుంటే బిల్లులు వస్తాయి. ఈ ఏడాది డిసెంబర్ వరకు బిల్లులు పడతాయి. నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి కొత్త రుణాలు మంజూరయ్యే అవకాశం ఉంది.

- స్వామిదాస్, హౌసింగ్ ఏఈ, బైరెడ్డిపల్లె

కత్తెర పురుగు నివారణకు చర్యలు


బోడేవారిపల్లిలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న డాక్టర్ మంజుల

పుంగనూరు: మొక్కజొన్న పంటలో కత్తెర పురుగుల నివారణకు చర్యలు తీసుకోవాలని కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ మంజుల తెలిపారు. బుధవారం మండలంలోని బోడేవారిపల్లిలో మొక్కజొన్న పంటలను ఆమె పరిశీలించారు. లార్వాదశలో ఆకులను తినడం వల్ల పలుచటి జల్లెడ లక్షణాలు కనిపిస్తాయని, దీని ద్వారా మొక్కజొన్నను కత్తరించి తింటుందని తెలిపారు. దీని నివారణకు లింగాకర్షణ బుట్టలు ఎకరాకు 10నుంచి 15 చొప్పున అమర్చాలని సూచించారు.

కుంభాభిషేక ఉత్సవాలు ప్రారంభం

గుడుపల్లె: మండలంలోని కనమనపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వరదాంజనేయస్వామి కుంభాభిషేకం ఉత్సవాలు కనులపండువగా ప్రారంభమయ్యాయి. బుధవారం అంకురార్పణ, నిత్యహోమాలు నిర్వహించారు. గురువారం అగ్ని ప్రతిష్ఠ, పూర్ణాహుతి, హోమాలు, 9న శుక్రవారం మహాకుంభాభిషేకం, సీతారాముల కల్యాణోత్సవం, రాత్రి తిరువీధి ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

సదుం: సూక్ష్మ బిందు సేద్యం కోసం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఏఓ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రాయితీ ధరపై ప్రభుత్వం డ్రిప్, స్ప్రింకర్లను అందజేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న రైతులు రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన ప్రకటనలో కోరారు.

శ్రుతిమించుతున్న కూటమి ఆగడాలు


మాట్లాడుతున్న బాలాజీ నాయుడు

- పలమనేరు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాలాజీ నాయుడు

పలమనేరు: అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే కూటమి నాయకులు ఆగడాలు, దౌర్జన్యాలు ఎక్కువయ్యాయని పలమనేరు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాలాజీనాయుడు తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండల నాయకులతో కలసి బుధవారం ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ఈ మధ్యనే కౌండిన్య నుంచి టీడీపీ నేతలు అక్రమంగా వేలాది లోడ్ల ఇసుకను తోడి డంపులు చేశారన్నారు. ఆపై రాత్రికి రాత్రే వాటిని టిప్పర్లలో కర్ణాటకకు పంపారని ఆరోపించారు. ఇటీవల తాము ఆర్డీఓకు సాక్ష్యాధారాలతో ఫిర్యాదుచేస్తే స్పందించిన ఆయన సిబ్బందితో కలసి పెంగరగుంట పంచాయతీలో ఇసుక డంపులను సీజ్ చేశారన్నారు. అయితే అప్పటికే 80శాతం ఇసుకను టీడీపీ వారు డంప్‌ల నుంచి కర్ణాటకకు పంపించేశారన్నారు. మరోవైపు ఇసుక అక్రమ రవాణాలో స్థానిక రెవెన్యూ శాఖలోని కొందరు కింది స్థాయి అధికారుల మద్దతు కూటమి నేతలకుందన్నారు. మరోవైపు గ్రామాల్లో కరెంట్ కోతలు తప్పడం లేదని పశువులకు దప్పిక తీర్చాలన్నా ఇబ్బందిగా మారిందన్నారు. ప్రజలు నమ్మి ఇచ్చిన అధికారాన్ని ఇలా అన్యాయాలు, అక్రమాల కోసం వాడుకోవడం సబబు కాదన్నారు. కార్యక్రమంలో నేతలు రాజారెడ్డి, చెంగారెడ్డి, గోవిందుస్వామి నాయుడు, యువరాజ్, కుప్పయ్య, మునస్వామి, చిట్టినాయుడు, వస్రాయగౌడ పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు


పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని నాల్గో వార్డు, వినాయకనగర్, ఎద్దులసంత వీధిలో మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది బుధవారం పారిశుధ్య పనులు చేశారు. జేసీబీ వాహనాలతో డ్రైన్లలోని వ్యర్థాలను శుభ్రం చేశారు. గంటావూరు సచివాలయాల పరిధిలోని గృహనిర్మాణదారులతో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి సమావేశాన్ని నిర్వహించారు. ఇంటి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. మున్సిపల్ మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్, ఏఈ రూపేష్, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

భారత సంస్కృతిలో చేనేత ఓ భాగం


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వెంకటేశులు

పలమనేరు: చేనేత మన భారత సంస్కృతిలో ఒక భాగమని అది భారతీయతకు నిదర్శనమని పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. వెంకటేశులు తెలిపారు. స్థానిక కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశీయ రంగంలో చేనేత ముఖ్యమైన వాణిజ్య రంగమని తెలిపారు. చేనేతను రక్షించుకోవాల్సిన అవసరం మన పై ఉందన్నారు. అధ్యాపకులు నందీశ్వరయ్య, చిదంబరం, వెంకటేష్‌బాబు, రుక్మిణి పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి


పాఠాలపై అవగాహన కల్పిస్తున్న అతిథులు

కుప్పంరూరల్: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ సునీల్‌రాజ్ విద్యార్థులకు సూచించారు. బుధవారం కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులకు నిర్వహించే ఓరియెంటేషన్ ప్రోగ్రాంను ఆయన ప్రారంభించారు. వైస్ చైర్మన్ సునీల్‌రాజ్ మాట్లాడుతూ పోటీ ప్రపంచానికి తగినట్లు విద్యార్థులు తయారు కావాల్సి ఉంటుందన్నారు. మరో అతిథి విజయవాడ ఐసీటీ హెడ్ దినకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఇతర వ్యాపకాలకు పోకుండా కష్టపడి చదవాలని కోరారు. అనంతరం పాఠాలపై అవగాహన కల్పించారు. విజిలా జాస్మిన్, కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ భాస్కరన్, అధ్యాపకులు మాధవన్, పీఆర్‌ఓ ప్రవీణ్‌కుమార్, విద్యార్థులు ఉన్నారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

చౌడేపల్లె: శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని మాల మహానాడు మండల అధ్యక్షుడు జి.సుబ్రమణ్యం, ఉపాధ్యక్షుడు రెడ్డిప్రసాద్ కోరారు. బుధవారం తహసీల్దార్ హనుమంతు నాయక్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. నాయునివారిపాళ్యంలో 60 దళిత కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. ఎవరైనా చనిపోతే సమీపంలోని చెరువు వద్ద దహన క్రియలు నిర్వహిస్తున్నామని, వర్షాకాలంలో ఇబ్బందికరంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు పలుమార్లు వినతులు ఇచ్చినా న్యాయం చేయలేదని, ఇకనైనా స్పందించి శ్మశాన వాటికకు స్థలం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు


సర్టిఫికెట్లను అందజేస్తున్న గీతాకుమారి

బైరెడ్డిపల్లె: ఖరీఫ్ సాగులో వరినాట్లు వేసే సమయంలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించుకోవచ్చునని వ్యవసాయశాఖాధికారిణి గీతాకుమారి అన్నారు. మండలంలోని ఆల్లపల్లె సచివాలయ పరిధిలోని నాచుకుప్పంలో బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వరినాట్లు సమయంలో రైతులు అదనపు జాగ్రత్తలు తీసుకుంటే వరి పైరు చీడపీడల బారిన పడకుండా ఉండేందుకు అవకాశాలు ఉంటాయన్నారు. వ్యవసాయశాఖ ద్వారా అందించే సర్టిఫికెట్లను తీసుకుంటే మూడేళ్ల పాటు అధిక ధరలకు అమ్ముకునే అవకాశం ఉంటుందన్నారు. సర్టిఫికెట్‌కు రూ.200 చెల్లించాలని ఆమె అన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడొద్దు


విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న సీఐ

కుప్పంరూరల్: కళాశాలలో ఎవరూ ర్యాగింగ్‌కు పాల్పడరాదని, చేస్తే భవిష్యత్తు కోల్పోతారని కుప్పం అర్బన్ సీఐ జీటీ.నాయుడు హెచ్చరించారు. బుధవారం కుప్పం పాలిటెక్నిక్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని, ఇతర వ్యాపకాలపై మరలితే నష్టం తప్పదన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలను అంధకారంలోకి నెట్టుకోవద్దని హితవు పలికారు. అనంతరం విద్యార్థులచే ర్యాగింగ్ చేయబోమని ప్రమాణం చేయించారు. ప్రిన్సిపల్ జగన్నాథరావు, అధ్యాపకులు, పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం


కుప్పం: మాట్లాడుతున్న కడా పీడీ


సదుం: అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది


మాట్లాడుతున్న కడా పీడీ


లక్కనపల్లెలో అవగాహన ర్యాలీ

- కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం: బిడ్డకు తల్లి పాలు ఎంతో శ్రేష్టమని, తల్లి పాలపై బాలింతలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ సిబ్బందిపై ఉందని కుప్పం కడా పీడీ వికాస్ మర్మత్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వాహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కడా పీడీ తల్లిపాల వారోత్సవాల ప్రాముఖ్యతను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం బాలింతలకు, పిల్లలకు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ముర్రుపాలతో రోగ నిరోధక శక్తి

సదుం: పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు పట్టిస్తే రోగనిరోధకశక్తి పెరుగుతుందని పబ్లిక్ హెల్త్ నర్స్ జానకి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా మండల కేంద్రంలో మహిళా సంఘ సభ్యులతో బుధవారం ఆమె సమావేశం నిర్వహించారు. తల్లిపాలు పట్టడంపై ఉన్న అపోహలు విడనాడి రెండేళ్ల వరకు శిశువుకు పాలు పట్టాలన్నారు. ఆరోగ్య సిబ్బంది శిఖామణి, హేమలత, దీప పాల్గొన్నారు.

గుడుపల్లె: బిడ్డల ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమని కుప్పం కడా ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. బుదవారం స్థానిక పీఈఎస్ ఆస్పత్రి ఆడిటోరియంలో తల్లి పాలు వారోత్సవాల ముగింపు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పీఈఎస్ కళాశాల ప్రిన్సిపల్ హెచ్ఆర్ క్రిష్ణారావు, సూపరింటెండెంట్ సుబ్రమణ్యం, హరిచంద్ర, రాజేంద్రనాయుడు పాల్గొన్నారు.

తల్లిపాలు దివ్య ఔషధం

బైరెడ్డిపల్లె: తల్లిపాలు బిడ్డలకు దివ్య ఔషధంతో సమానమని బైరెడ్డిపల్లె, తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారులు విజయ్‌చంద్ర, అరుణ్‌కుమార్ సూచించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆరోగ్య సిబ్బందిచే గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమని, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలను బిడ్డకు తాగించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే ఆహారాన్ని గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా సమయపాలన పాటించి తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్లు సావిత్రమ్మ, కాంతమ్మ, ఆరోగ్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నేడే పాఠశాల కమిటీలకు ఎన్నికలు

- చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక
- ఏర్పాట్లను పూర్తి చేసిన ఎంఈఓలు
- ఎన్నికల పరిశీలకులుగా ఎంపీడీఓలు, తహసీల్దార్లు
- పటిష్టంగా ఎన్నికలు జరిగేనా?


పాతపేట ప్రాథమిక పాఠశాల

పలమనేరు: నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, కస్తూరిభా, మోడల్ స్కూళ్ల పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు నేడు జరగనున్నాయి. ఇందుకోసం ఆయా మండల ఎంఈఓలు ఇప్పటికే సన్నాహాలు చేశారు. ఆయా పాఠశాలల హెచ్ఎంల ఆధ్వర్యంలో ఎన్నికలు జరిపించి పాఠశాల కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుంటారు. ఇందుకు ఎన్నికల పర్యవేక్షకులుగా సంబంధిత మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు, కింది స్థాయి సిబ్బంది వ్యవహరించనున్నారు. ఈనెల 1న రాష్ట్ర ప్రభుత్వం ఈ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే.

మధ్యాహ్నంలోపు ఎన్నికలు, ఆపై ఫలితాలు..

నియోజకవర్గంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 469 దాకా ఉన్నాయి. వీటితోపాటు మూడు కస్తూరిభా, మూడు సంక్షేమశాఖ, ఓ గురుకుల పాఠశాలకు ఎన్నికలు జరగనున్నాయి. నేటి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల దాకా ఎన్నికలను నిర్వహించనున్నారు. ఆపై కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల ఎంపిక, మధ్యాహ్నం 2 గంటలకు వారిచే ప్రమాణస్వీకారం, ఆపై 3 గంటలకు ఎస్ఎంసీ తొలి సమావేశాన్ని నిర్వహించడంతో ఎన్నికలతంతు ముగుస్తుంది.

ఎన్నికల ప్రక్రియ ఇలా..

ఎన్నిక జరగాలంటే 50శాతం మంది తల్లిదండ్రులు హాజరుకావాలి. ఎన్నికల ప్రక్రియ చేతులెత్తడం లేదా నోటితో చెప్పడం ద్వారా ఏదేనీ అసాధారణ పరిస్థితిలో మాత్రం సీక్రెట్ బ్యాలెట్ ఉంటుంది. ఓ విద్యార్థికి తల్లి లేదా తండ్రి లేదా సంరక్షకుడు మాత్రం ఓటు వేయాలి. ఇద్దరు పిల్లలు వేర్వేరు తరగతుల్లో ఉంటే తల్లి తండ్రి సైతం ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. తొలుత ఎస్ఎంసీ సభ్యులుగా ఎంపికైన వారు ఆపై చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకోవాల్సి ఉంటుంది.

పాఠశాలల అభివృద్ధిలో వీరే కీలకం..

పాఠశాల అభివృద్ధిలో ఎస్ఎంసీలు చాలా కీలకం. వీరి ద్వారానే బడి అభివృద్ధి పనులు సాగాల్సి ఉంటుంది. గత ప్రభుత్వంలోనూ వీరి ఆధ్వర్యంలోనే నాడు-నేడు పనులు సైతం సాగాయి. నాడు-నేడు రెండవ విడత రెండు స్పెళ్లలో పెండింగ్‌లోని పనులపై కొత్తగా ఎంపికైన కమిటీల పెత్తనం ఉంటుంది. కాబట్టి ఈ ఎన్నికలకు అధికార పార్టీ మద్దతు తల్లిదండ్రులను మెజారిటీ స్థానాల్లో గెలిపించే యోచన అధికార పార్టీ నేతలపై ఉందనే మాట వినిపిస్తోంది.

ఎన్నికలు సజావుగా సాగేనా?

కాగా అధికార పార్టీ ఎలాగైనా గ్రామాల్లో తమకు అనుకూలమైన వారినే కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లుగా గెలిపించుకునే అవకాశం ఉంది. దీనికి తోడు అధికారం ఉన్నందున సంబంధిత పాఠశాలల హెచ్ఎంలకు ఒత్తిళ్లు తప్పేలాలేవు. అయితే ఎన్నికలను పటిష్టంగా నిర్వహిస్తామని సంబంధిత మండలాల ఎంఈఓలు మాత్రం చెబుతున్నారు.

రొంపిచెర్లలో 44.6 మిమీ వర్షపాతం నమోదు

రొంపిచెర్ల: మండలంలో మంగళవారం రాత్రి 44.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఖరీఫ్ సీజన్‌లో రైతులు వేరుశనగ, టమాట, వరి పంటలను సాగు చేశారు. గత నెల రోజులుగా వర్షం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే మంగళవారం రాత్రి వర్షం పడడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. వ్యవసాయ పంటలను సాగు చేసుకోవచ్చునని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.